# విధి వేసిన శిక్ష

★

రచన : శ్రీ దూలం నారాయణ.

(గత సంచిక తరువాయి)

ఎందుకో తెలుసా? నేను రాక్షసుణ్ణి డబ్బు చేత-కళ చేత ఎంతో మంది కన్యలను ఆకర్షించుకుని వాళ్ళ మానాలను మలినపరచాను. వాళ్ళ బ్రతుకులను బజారుపాలు చేశాను బావుల్లో పడద్రోశాను అగ్నిసాక్షిగా పెళ్ళాడిన ఇల్లాలి శీలాన్ని శంకించి, ఈటెల వంటి మాటలతో ఆమె హృదయాన్ని గాయపరచాను. నానావిధాలుగా హింసించాను. పాపం ఆ అమాయకురాలు నా కిరాత చర్యలకు తట్టుకోలేక ఒకనాటిరాత్రి...ఇక నేను వ్రాయలేను. ముగిస్తా. ఏమైతేనేం? నా దుశ్చర్యలు, దురంతాలు లోకానికి తెలిసిపోయాయి. ఒకప్పుడు ఎంతగానో అభిమానించిన ఈ ప్రజలే, ఇప్పుడు నన్ను కుక్కకంటే హీనంగా చూస్తున్నారు. విధికూడా నాకు మంచిశిక్షే వేసింది. ఏం శిక్ష? చెప్పను... చెప్పను.

ప్రస్తుతం నేనుచాలా హాయిగా ఉన్నాను. ఈ సుఖంలోనే నీకింత సుదీర్ఘ లేఖ వ్రాశాను. క్షమించు. అక్షరాలు అస్తవ్యస్తంగా ఉండి-చదవడానికి నిన్ను ఇబ్బంది పెట్టాయనుకుంటా. సరే ఇక వుంటా! ఓహ్! ఇదేంహాయి! ఏవో దూరతీరాలకు తేలిపోతున్నట్లు! ఏవేవో లోకాలకు ఎగిరిపోతున్నట్లు! వనూ! చాలాబావున్నాయ్ ఈ క్షణాలు...నూరేళ్ళు నీవు సుమంగళిగా, క్షేమంగా వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ... ... ... కృష్ణ."

♦ ♦ ♦

మండువేసవి పగలు పన్నెండు గంటల ప్రాంతంలో-చండమార్తాండుడు, తన ప్రచండ కిరణాలను లోకపు ఇంటికప్పుపై ప్రసరిస్తున్నాడు. రోడ్లపై ఎక్కువ జన సంచారం లేదు. ముఖానికి పట్టిన చెమటను రుమాలుతో తుడుచుకుంటూ ఓ ఇంటి గుమ్మంముందు ఆగింది వనజ.

అంతలో లోనుంచి నలభైఏళ్ళపై బడ్డ వ్యక్తి బయటికి వస్తూ-వనజను చూచి 'ఎవరుకావాలండి?' అని ప్రశ్నించాడు.

"ప్రక్కింట్లో 'కృష్ణ' పేరుగలాయన ఒకతనుండాలి. అతనెక్కడికి వెళ్ళాడండి" అని అడిగింది వనజ ఆ వ్యక్తిని.

'కృష్ణ' పేరువినగానే అతడు ముఖంలో ఏహ్య భావం ప్రకటిస్తూ "అతడు మీకేం అవుతాడండి" అని ప్రశ్నించాడు.

ఏమవుతాడని చెప్పాలో తెలియక "దూరపు బంధువులెండి" అని చెప్పింది వనజ.

"అలాగా' అతడు చనిపోయి ఇవ్వాల్టికి మూడు దినాలయింది. పోనియ్యండి. అటువంటివాళ్ళు బ్రతికేకంటే చావడమె మంచిది. కొంత భూ భారమైనా తగ్గుతుంది." అని చనిపోయిన వ్యక్తిపై తనకున్న అక్కసునంతా వెళ్ళకక్కాడా వ్యక్తి.

"చచ్చిపోయాడా ఎలా? ఎవరుచంపారు?" అని అమితాశ్చర్యం కూడుకున్న స్వరంలో ప్రశ్నించింది

"ఎవరూ చంపలేదు, అతడే ఏదో త్రాగి అనుకుంటున్నారందరు. అయినా అటువంటి లెప్రసీ వెధవలు ఉంటేనేం? పోతేనేం" అని చెప్పి వేగంగా ఇంట్లో కెళ్ళాడా వ్యక్తి.

"ఆఁ! కృష్ణకు కుష్టువ్యాధా!?" అని అరచి నేలపై కూలబడిపోయింది పాపం! వనజ!!


కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం 1938.

విడి ప్రతి ... 50 పైసలు

సంవత్సర చందా ... రూ. 9-00.

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారులుగా చేరండి.

అన్ని హిగ్గిన్‌బాథమ్స్ బుక్‌స్టాల్సులో దొరుకును.

♦ కథాంజలి ♦

నెం. 10, మురుగేశ మొదలి వీధి,

మదరాసు - 600 001.